HICON SERIES

CLASS 5 TERM-1

# తెలుగు భారతి

## LESSON 2







CLICK HERE TO ACTIVATE

LESSON

# 2. తెలుగు సంవత్సరాలు



పోస్ట్....

కేక వినపడగానే పరుగెత్తుకుంటూ వెళ్ళింది రాణి. పోస్ట్‌మాన్ ఇచ్చిన శుభలేఖ అందుకొని ఇంట్లోకి పరుగెత్తింది. శుభలేఖను తల్లి జానకమ్మకు ఇచ్చింది. జానకమ్మ శుభలేఖను చదివింది. అది వాళ్ల బాబాయి కొడుకు శేఖర్ వివాహ ఆహ్వానపత్రిక. వివాహాలకు వెళ్లటమన్నా, ప్రయాణాలన్నా రాణికి చాలా ఇష్టం. అందుచేత తల్లీకూతుళ్లు ప్రయాణమై వెళ్ళే సమయంలో జానకమ్మ మరోసారి శుభలేఖను తీసుకొని ముహూర్తం చూసింది. రాణి కూడా శుభలేఖను చదివింది.

శుభలేఖలో శ్రీ నందననామ సంవత్సరం అని ఉంది. "అమ్మా! ఇది 2012 సంవత్సరం గదా! అలా రాశారేమిటి?" అని రాణి అడిగింది.

"ఓహో! అదా!" రాణీ! నందన అనేది తెలుగు సంవత్సరం పేరు. సంవత్సరానికి ఎన్నిరోజులో తెలుసా? సంవత్సరం అంటే 365 రోజులన్నమాట. సంవత్సరకాలాన్ని ఎలా లెక్కిస్తారో నీకు తెలుసా. భూమి తన చుట్టూ తాను తిరుగుతూ సూర్యుని చుట్టూ తిరుగుతుంది. భూమి సూర్యుని చుట్టూ ఒకసారి తిరిగి రావడానికి పట్టే కాలాన్ని సంవత్సరం అంటారు. ఈ సంవత్సరంలో రోజులు, నెలలు ఉంటాయి. 60 సెకన్లు 1నిమిషం, 60నిమిషాలు ఒక గంట అని, అలాంటి 24గంటల కాలాన్ని ఒకరోజని, ముప్పైరోజులను ఒక నెల అనిపిలుస్తారు. ఈనెలలు 12, అవి చైత్రము, వైశాఖము, జ్యేష్ఠము, ఆషాడము, శ్రావణము, భాద్రపదము,ఆశ్వయుజము, కార్తీకము, మార్గశిరము, పుష్యము, మాఘము, ఫాల్గుణము. ఈ 12 నెలలు కలిపి ఒక సంవత్సరము. ఇలాంటి సంవత్సరాలు అరవై. ఈ అరవై సంవత్సరాలకు మన పెద్దలు ఒక్కొక్క సంవత్సరానికి ఒక్కొక్క పేరు పెట్టారు.

అవి

| | | | |
|---|---|---|---|
| 1. ప్రభవ | 16. చిత్రభాను | 31. హేవిళంబి | 46. పరీధావి |
| 2. విభవ | 17. స్వభాను | 32. విళంబి | 47. ప్రమాదీచ |
| 3. శుక్ల | 18. తారణ | 33. వికారి | 48. ఆనంద |
| 4. ప్రమోదూత | 19. పార్థివ | 34. శార్వరి | 49. రాక్షస |
| 5. ప్రజోత్పత్తి | 20. వ్యయ | 35. ప్లవ | 50. నల |
| 6. ఆంగీరస | 21. సర్వజిత్తు | 36. శుభకృతు | 51. పింగళ |
| 7. శ్రీముఖ | 22. సర్వధారి | 37. శోభకృతు | 52. కాళయుక్తి |
| 8. భావ | 23. విరోధి | 38. క్రోధి | 53. సిద్ధార్థి |
| 9. యువ | 24. వికృతి | 39. విశ్వావసు | 54. రౌద్రి |
| 10. ధాత | 25. ఖర | 40. పరాభవ | 55. దుర్మతి |
| 11. ఈశ్వర | 26. నందన | 41. ప్లవంగ | 56. దుందుభి |
| 12. బహుధాన్య | 27. విజయ | 42. కీలక | 57. రుధిరోద్గారి |
| 13. ప్రమాది | 28. జయ | 43. సౌమ్య | 58. రక్తాక్షి |
| 14. విక్రమ | 29. మన్మథ | 44. సాధారణ | 59. క్రోధన |
| 15. వృష | 30. దుర్ముఖి | 45. విరోధికృతు | 60. అక్షయ. |


ఈ అరవై సంవత్సరాలు ఇదే వరుసలో ఒకదాని తర్వాత ఒకటి వస్తాయి. ఒక వరుస పూర్తి అయిన తర్వాత మళ్ళీ మొదలవుతాయి. దీనిని 'షష్టివర్షచక్రం' అంటారు. ఇలాంటి కొన్నివేల సంవత్సరాలను కలిపి ఒక 'యుగం' అంటారు.

రాణీ! ఇంతకు ముందు నీవు 2012 సంవత్సరం అన్నావు కదా! దాన్ని క్రీస్తుశకం 2012వ సంవత్సరం అని లెక్కిస్తారు. చరిత్రలో ఎప్పుడు ఏం జరిగిందో చెప్పడానికి సంవత్సరాలను వరుసగా లెక్కపెట్టుకోవడం అవసరం కదా! అయితే ఇవి ఎక్కడ నుండి లెక్కపెట్టాలి? అనేది ప్రశ్న. ఏదో ఒక ప్రముఖ సంఘటన జరిగిన నాటినుండో, ఒక మహాప్రవక్త జన్మదినం నుండో, ఒక మహాచక్రవర్తి సింహాసనం ఎక్కిన రోజునుండో లెక్కించడం ఆనవాయితీ. దీనినే 'శకం' అంటారు. మన దేశంలో శాలివాహనశకం, విక్రమశకం, అనేవి వాడుకలో ఉన్నాయి. శాలివాహన శకం శాలివాహనుడు సింహాసనం అధిష్ఠించిన రోజు నుండి ప్రారంభమయింది. విక్రమశకం విక్రమార్కుడు సింహాసనం ఎక్కినరోజు నుండి ప్రారంభమయింది. భిన్న దేశాలకు, జాతులకు ఉపయోగపడేటట్లు 'ఉమ్మడిశకం' వాడతాం. అలాంటిదే క్రీస్తుశకం. ఇది జీసస్ క్రీస్తు పుట్టుకతో ప్రారంభమైంది.

"అమ్మో! దీని వెనుక ఇంత కథ ఉందన్నమాట. మరి యుగాలు అంటే ఏమిటమ్మా?" అంది రాణి.

"అయితే విను. మనకు కాలపరిమితిలో నాలుగు యుగాలు ఉన్నాయి. అవి !

1. కృతయుగం.
2. త్రేతాయుగం
3. ద్వాపరయుగం
4. కలియుగం.




ఈ నాల్గింటిని కలిపి మహాయుగం అంటారు. మహాయుగకాలం 43,20,000 సంవత్సరాలు. దీనిలో పదవ వంతు కలియుగం. కలియుగానికి రెట్టింపు ద్వాపరయుగం, మూడురెట్లు త్రేతాయుగం, నాలుగురెట్లు కృతయుగంగా గుర్తించారు. దీనిని బట్టి ఏ యుగానికి ఎన్ని సంవత్సరాలో నీవు చెప్పు.

## అభ్యాసం

I. అర్థాలు :

ముహూర్తం = రెండు గడియల కాలం, పెండ్లి మొదలైన శుభకార్యాలు జరుపుకోవడానికి నిర్ణయించబడే సమయం
పోస్ట్‌మాన్ = తపాలా బంట్రోతు
వివాహం = పెండ్లి
శుభలేఖ = మంగళకరమైన విషయాన్ని తెలిపే ఉత్తరం
షష్ఠి = అరవై
ప్రవక్త = మతసిద్ధాంతాన్ని వ్యాపింపజేసినవాడు
అధిష్ఠించిన = ఎక్కిన
ఆనవాయితీ = సంప్రదాయం
ఆహ్వానం = పిలుపు
ఉమ్మడి = అందరికి సంబంధించిన
పరిమితి = హద్దు
వర్షం = వాన,సంవత్సరం

## II. క్రింది ఖాళీలను పూరించండి.

1. ...................................................... శుభలేఖను చదివింది.
2. ఆమె ఆనందానికి ...................................................... లేవు.
3. శుభలేఖలో ...................................................... నామ సంవత్సరం అని ఉంది.
4. ...................................................... తన చుట్టూ తాను తిరుగుతూ సూర్యుని చుట్టూ తిరుగుతుంది.
5. ఇలాంటి కొన్ని వేల సంవత్సరాలను కలిపి ఒక ...................................................... అంటారు.
6. తెలుగు సంవత్సరాలలో చివరిది ......................................................

## III. ఈ క్రింది ప్రశ్నలకు ఒక్క వాక్యంలో జవాబులు వ్రాయండి.

1. వచ్చిన వివాహ ఆహ్వానపత్రిక ఎవరిది ?
2. క్రీస్తుశకం ఎప్పుడు ప్రారంభమైంది ?
3. కాలపరిమితిలో ఎన్ని యుగాలు ఉన్నాయి?
4. కలియుగ కాలమెంత ?

## IV. సరైన సమాధానం గల అక్షరాన్ని బ్రాకెట్టులో వ్రాయండి.

1. కాలపరిమితిలోని యుగాలు. ( )

   (క) మూడు (గ) నాలుగు (చ) రెండు

2. సంవత్సరానికి ఎన్ని రోజులు ? ( )

   (క) 364 (గ) 360 (చ) 365

3. భిన్న దేశాలకు, జాతులకు ఉపయోగపడే శకం ఏది ? ( )

   (క) ఉమ్మడిశకం (గ) శాలివాహనశకం (చ) విక్రమశకం

4. శుభలేఖలో ఉన్న సంవత్సరం పేరేమిటి? ( )

   (క) ప్రమాది (గ) అక్షయ (చ) నందన

## V. ఇతర వచనాలు వ్రాయండి.

1. అవధులు - ....................................
2. సంవత్సరం - ....................................
3. శకం - ....................................
4. పరిమితి - ....................................

## VI. వ్యతిరేకపదాలు వ్రాయండి.

1. ఆనందం × ....................................
2. అధిష్ఠించిన × ....................................
3. ప్రారంభం × ....................................
4. సమాధానం × ....................................

## VII. క్రింది పదాలతో సొంతవాక్యాలు వ్రాయండి.

1. ప్రయాణం : ....................................................................................................

....................................................................................................

2. ఆహ్వానపత్రిక : ....................................................................................................

....................................................................................................

3. ఆనవాయితీ : ....................................................................................................

....................................................................................................

4. గుర్తించుట : ....................................................................................................

....................................................................................................

## VIII. జతపరచండి.

| | | | |
|---|---|---|---|
| 1. కలియుగం | ( ) | (క) | 12,96,000 సంవత్సరాలు |
| 2. ద్వాపరయుగం | ( ) | (గ) | 17,28,000 సంవత్సరాలు |
| 3. త్రేతాయుగం | ( ) | (చ) | 4,32,000 సంవత్సరాలు |
| 4. కృతయుగం | ( ) | (జ) | 8,64,000 సంవత్సరాలు |

## IX. క్రింది ప్రశ్నలకు జవాబులు వ్రాయండి.

1. యుగాలు ఎన్ని ? అవి ఏవి ?
2. శకం అంటే ఏమిటి? మనకు 'శకం' ఆవశ్యకత ఏమిటి ? వాటిపేర్లు తెల్పండి ?
3. క్రింది వాటిని వివరించండి.

   (క) సంవత్సరం (గ) షష్ఠివర్షచక్రం (చ) మహాయుగం
4. తెలుగు సంవత్సరాలు ఎన్ని ? వాని పేర్లు వ్రాయండి.

# వ్యాకరణము

భాషాభాగాలలో నామవాచకం, సర్వనామం, విశేషణం గురించి ఇంతకు ముందు తరగతులలో తెలుసుకున్నాం. ఇప్పుడు భాషాభాగాలలో ఒకటైన క్రియను గురించి తెలుసుకుందాం. 'క్రియ' అంటే పనిని గురించి తెలిపేది అని అర్థం.

వాక్యం కర్త, కర్మ, క్రియ అనే వాటితో ఏర్పడుతుంది. అందులో 'కర్త' అంటే పనిని చేసేవాడిని గురించి చెబుతుంది. 'కర్మ' అంటే పని ఫలితాన్ని అనుభవించేవాడు. ఈ మూడింటితో ఏర్పడేదే వాక్యం.

కర్త : పనిని చేసేవాడిని కర్త అంటారు. కర్తను గురించి తెలిపే పదాన్ని 'కర్తృపదం' అంటారు.

ఉదా : రాము నాట్యం చేస్తున్నాడు.

ఈ వాక్యంలో 'నాట్యం చేయడం' అనేది పని కాబట్టి 'నాట్యం చేస్తున్నాడు' అనేది క్రియ. ఆ క్రియను చేస్తున్నది రాము కాబట్టి 'రాము' అనేది కర్తృపదం.

ఈ క్రింది వాక్యాలలో కర్తృ పదాన్ని గుర్తించండి.

1. సీత బల్లమీద కూర్చున్నది.
2. జానకి పాలు తాగుచున్నది.
3. గాడిద మూటలు మోయుచున్నది.
4. సునీత బట్టలు ఉతుకుచున్నది.

కర్మ : వాక్యంలో కర్త, క్రియలతోబాటు కర్మ కూడా ఉంటుంది. పని ఫలితాన్ని అనుభవించే పదాన్ని 'కర్మ' అంటారు.

ఉదా : రాముడు సీతను వివాహమాడాడు.

ఇక్కడ 'సీత' అనేది 'కర్మ'. ఎందుకంటే 'వివాహం వలన ఫలితాన్ని అనుభవించినది' సీత కాబట్టి 'సీత' కర్మపదం.

క్రింది వాక్యాలలోని కర్మ పదాలను గుర్తించండి.

1. రవి చెట్టును నరికాడు.
2. శ్రీకాంత్ బంతిని తన్నాడు.
3. వేటగాడు పావురాలను వేటాడాడు.
4. గీత పాటను పాడింది.